## 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ

### - మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, అక్టోబర్ 18: పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఆన్‌లైన్ వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్స్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీస్ ఫ్లాగ్ డేను నిర్వహించనున్నట్లు తెలిపారు. https://forms.gle/b7bejvzfo6j29vuz6 వైబ్ సైట్ ద్వారా వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీలు కేటగిరి-1కు ఇంటర్మీడియట్ వరకు, కేటగిరి-2 డిగ్రీ అపై విద్యార్థులకు, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీస్ పాత్ర అనే అంశాల మీద ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిని అక్టోబర్ 24 వరకు సమర్పించాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందికీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీసులకు పని జీవిత సమతుల్యత, కేటగిరీ-1 కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు, సమాజంలో లింగ సమానత్వాన్ని కాపాడడంలో పోలీసుల పాత్రపై కేటగిరీ-2 ఎస్సై నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## నలగండ్ల అశోక్‌కు విద్యారత్న నేషనల్ అవార్డు



విద్యారత్న నేషనల్ అవార్డు అందుకుంటున్న నలగండ్ల అశోక్‌కుమార్

జిన్నారం, అక్టోబర్ 18: విద్యారత్న అవార్డును జిన్నారం మండలానికి చెందిన నలగండ్ల అశోక్‌కుమార్ అందుకున్నారు. లక్ష్మీపతిగూడెం పంచాయతీ చౌదరిగూడెం గ్రామానికి చెందిన నలగండ్ల అశోక్ ఎల్లంకి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. అశోక్‌కుమార్ చేస్తున్న సేవలను హైదరాబాద్‌కు చెందిన బహుజన సాహిత్య అకాడమీ గుర్తించింది. ఇటీవల న్యూఢిల్లీ ఆంధ్ర అసోసియేషన్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా బహుజన రైటర్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్‌లో నలగండ్ల అశోక్‌కుమార్‌కు ఢిల్లీ సాంఘిక, కార్మిక సంక్షేమ శాఖ మంత్రి రాజుకుమార్ ఆనంద్, కరోల్బాగ్ ఎమ్మెల్యే విశేష్‌రావు, కాన్షీరామ్ ఫౌండేషన్ స్వర్ణకౌర్ విద్యారత్న అవార్డును అందజేశారు.

## పరుగు పందెంలో రాష్ట్ర స్థాయికి సాహితీ ఎంపిక



సాహితీ, విద్యార్థిని

రామాయంపేట, అక్టోబర్ 18: అండర్ 16 బాలికల అథ్లెటిక్ 100 మీటర్ల పరుగు పందెంలో రామాయంపేటలోని వివేకానంద విద్యాలయానికి చెందిన విద్యార్థిని సాహితి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరెస్పాండెంట్ రామ్‌కుమార్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 16 బాలికల అథ్లెటిక్ పోటీలను బుధవారం నిర్వహించారు. రామాయంపేట నుంచి ఉత్తమ స్థానంలో నిలవడంలోనే గాకుండా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది సాహితీ. విద్యార్థినిని వివేకానంద విద్యాలయం కరెస్పాండెంట్ రామ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 26న సూర్యాపేట జిల్లా కేంద్రంలో అండర్ 16 బాలికల రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నారు.

## ఎల్లంకి కళాశాలకు యూజీసీ అటానమస్ గుర్తింపు

పటాన్‌చెరు, అక్టోబర్ 18: పటేల్‌గూడ ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి యూజీసీ అటానమస్ గుర్తింపు వచ్చింది. బుధవారం ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌పాల్ విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఎల్లంకి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 2001 నుంచి విద్యారంగంలో సేవలందిస్తున్నదన్నారు. ఈ ఏడాది యూజీసీ న్యూ ఢిల్లీ ఆమోదించడంతో జేఎన్‌టీయూ హైదరాబాద్ అటానమస్ గుర్తింపు ఇచ్చిందని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ సదాశివరెడ్డి ఆధ్వర్యంలో విద్యారంగంలో తమ కళాశాల రాణిస్తున్నదన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందజేయడంలో తమ కళాశాల విశేషమైన కృషి చేసిందన్నారు. కళాశాల అధ్యాపక బృందానికి, సిబ్బందికి, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల డైరెక్టర్లు సాంబశివరావు, సాయికిరణ్‌రెడ్డిను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.



పటాన్‌చెరులోని పటేల్‌గూడలో ఉన్న ఎల్లంకి కళాశాల

# ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు



నారాయణఖేడ్‌లో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్‌కుమార్ ఇతర అధికారులు



జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల సమగ్రి పంపిణీ చేసే స్థలంను పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్

- రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో తొమ్మిది చెక్‌పోస్టులు
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శరత్
- పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి
- సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీలు చేసిన కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్

న్యాల్‌కల్, అక్టోబర్ 18: శాసనసభ ఎన్నికల సందర్భంగా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సంగారెడ్డి ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్, ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. బుధవారం మండలంలోని తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని హుస్సెల్లి, మల్గి గ్రామాల సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను వారు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఈ చెక్‌పోస్టుల వద్ద 24 గంటల ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఆయా రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రాకుండా చూడాలన్నారు. సరైన పత్రాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విడతలు వారీగా విధులు నిర్వహిస్తూ, వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి సరైన వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. చెక్‌పోస్టులతో పాటు సరిహద్దు గ్రామాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వారి వెంట అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్, హద్నూర్ ఎస్సై రామానాయుడు, మల్గి సర్పంచ్ మారుతీయాదవ్ తదితరులు ఉన్నారు.

**నారాయణఖేడ్‌లో..**

నారాయణఖేడ్, అక్టోబర్ 18: నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శరత్ తెలిపారు. బుధవారం కలెక్టర్, ఎస్పీ రూపేశ్‌కుమార్‌తో కలిసి నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించామన్నారు. రాష్ట్ర సరిహద్దులో తొమ్మిది చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నారాయణఖేడ్‌లోని స్ట్రాంగ్‌రూం, పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. నాగల్‌గిద్ద మండలం మోర్గి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేసి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. మనూరు మండలం బెల్లాపూర్‌లోని సమస్మాత్మక పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వారి వెంట నారాయణఖేడ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వెంకటేశం, స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

**ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేయాలి**

జహీరాబాద్, అక్టోబర్ 18: ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని, పోలింగ్ బూత్‌లు, ఈవీఎంల గోదాం వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శరత్ సూచించారు. బుధవారం జహీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎం గోదాం, ఈవీఎంల పంపిణీ కేంద్రం, పోలింగ్ బూత్‌లు, అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను పరిశీలించాలని సూచనలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, గంజాయి సరఫరా కాకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్పీ రూపేశ్, అడిషనల్ ఎస్పీ అశోక్, జహీరాబాద్ ఆర్‌డీవో నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకారెడ్డి, డీఎస్పీ రఘు, రవాణా శాఖ చెక్‌పోస్టు ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ సీఐ రాజు, మున్సిపల్ కమిషనర్ సుభాశ్‌రావు, జహీరాబాద్, మొగుడంపల్లి ఎంపీడీవోలు సుమతి, మహేశ్, జహీరాబాద్ పట్టణ ఎస్సై శ్రీకాంత్, చెరాగ్‌పల్లి ఎస్సై నరేశ్, అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు

చిన్నశంకరంపేట, అక్టోబర్ 18: కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయ మాటలు విని మోసపోవద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు తెలిపారు. బుధవారం మండలంలోని గవ్వలపల్లిలో కాంగ్రెస్, బీజేపీ నుంచి కొండగళ్ల రాజు, బగుడం నవీన్‌తోపాటు మరో 60 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన యువకులకు బీఆర్ఎస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పేదలు అనేక సంక్షేమ పథకాలు అందుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కారు గుర్తుకు ఓటేసి పద్మక్కను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనంపల్లి సోషల్ వర్కర్‌కు శ్రీకాంత్‌సాగర్ రాజీనామా

రామాయంపేట, అక్టోబర్ 18: మైనంపల్లి సోషల్ వర్కర్‌గా మొదటి నుంచి పని చేస్తున్న తెలంగాణ ఉద్యమ నేత శ్రీకాంత్ సాగర్ ఆ వర్గం నుంచి బయటకొచ్చారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైనంపల్లి వర్గంలో మొదటి నుంచి పనిచేశానని, ఇప్పుడు కొత్తగా వచ్చిన వారికి అవకాశం ఇవ్వడం తనకు నచ్చలేదన్నారు. ఇలాంటి ఒంటెద్దు పోకడలు నచ్చకే తాను బయటకొచ్చానన్నారు. తన సొంత గ్రామంలో ఎన్నో బోరుబావులు వేసినా వాటికి మోటార్లు బిగించాలని, 35 మంది అనాథ పిల్లలకు బ్యాంకులో డిపాజిట్ చేస్తానన్న డబ్బులు డిపాజిట్ చేయాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. వాళ్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లడంతో బాధ కలిగిందన్నారు. తనతో అక్కన్నపేటలో వందలాది యువకులం బయటకొచ్చామన్నారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ తనకు జిల్లాలో సముచిత స్థానం కల్పించిందన్నారు. ఎమ్మెల్యే పద్మక్క తనను ముందుండి నడిపించారన్నారు. రామాయంపేట యూత్ అధ్యక్షుడిగా నియమించిన పద్మాక్కకు జీవిత కాలం రుణపడి ఉంటానన్నారు. సమావేశంలో అనుముల సుధాకర్, శశిధర్, రాజేందర్, శ్రీను సాగర్, వంశీ, నిఖిల్, రఘుపతి, ప్రేమ్ తదతరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడతున్న ఉద్యమ నేత శ్రీకాంత్ సాగర్